క్లుప్తంగా

ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్‌లేదా ఫెయిల్ అయి 18 నుంచి 26 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు ఇందుకు అర్హులన్నారు. 35 రోజుల శిక్షణా కాలంలో కంప్యూటర్ స్కిల్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో అత్యుత్తమ శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ సూచించారు. శుక్రవారం 'ఫ్రైడే డ్రై-డే' కార్యక్రమంలో భాగంగా కడప నగరం నాగరాజుపేట అర్బన్ ట్రెయినింగ్ హెల్త్ సెంటర్ పరిధిలోని సీయోన్ పురం ప్రాంతంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పర్యటించారు. తొలుత అక్కడ జరుగుతున్న డ్రై-డే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డ్రైనేజీ కాలువలో పూడిక తీయించి లార్వా నాశక ద్రావణాన్ని పిచికారి చేయించారు. స్థానికులకు గ్రూప్ మీటింగ్ నిర్వహించి సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాప్తి జరిగే వ్యాధుల గురించి వివరించారు. ట్రైనీ డాక్టర్స్ కౌశిక్, శివ, నితీశ్, శశి , వార్డు హెల్త్, శానిటరీ సెక్రెటరీలు, ఆశా వర్కర్లు , పాల్గొన్నారు.

విప్లవ చైతన్య జ్వాల చే గువేరా



చే గువేరా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విప్లవ చైతన్య జ్వాల చే గువేరా అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజనం సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ అన్నారు. శుక్రవారం చే గువేరా జయంతిని కడపలోని ప్రభుత్వ ఐటీఐలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. జీఆర్ఎస్ వైస్ జిల్లా అధ్యక్షులు రెడ్డి సాయి, నాయకులు శ్రీకాంత్, నాగమునెయ్య, నవీన్, తేజ, వీరభద్రాచారి, అభిలాష్, బాలాజీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరం ప్రారంభం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పాల్ మోహన్ తదితరులు

కడప కల్చరల్ : కడప నగరం పక్కీరుపల్లెలో శుక్రవారం కడబూర ప్రార్థనా మందిరాన్ని స్థానిక ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పాస్టర్ డాక్టర్ ప్రసన్నకుమార్ గోర్ల సజీవ దేవుని సరాగాలు పేరిట రచించిన స్తుతి గీతాల పుస్తకాన్ని పాస్టర్ డాక్టర్ పాల్ మోహన్ ఆవిష్కరించారు. అనంతరం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఇందులోని ప్రతి పాట దేవునిచేత ప్రేరేపించబడిందన్నారు. ఈ పాటలు వెలువడటానికి తన సతీమణి కృషి ఉందన్నారు. ఆయన కుమారుడు, చర్చి పరిచర్యల వ్యవస్థాపకులు పాస్టర్ ఎం.శరత్‌కుమార్ ముఖ్య ప్రసంగం చేశారు. ప్రతి క్రైస్తవుడు ఆధ్యాత్మికతతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. తొలుత గాయకులు పాల్ రత్నం తన పాటలతో అందరినీ అలరింపజేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు పాల్ మోహన్, కె.రాజన్న, హరి, డేవిడ్, ఎం.వరప్రసాద్ రావు, స్వర్ణన్ రత్నకుమార్, సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు నాగభైరవ కోటేశ్వరరావు

బద్వేలు అర్బన్ : నేటి సమాజానికి సాహితీ స్ఫూర్తి కలిగించిన నాగభైరవ కోటేశ్వరరావు చిరస్మరణీయులు అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు కొనియాడారు. ప్రముఖ కవి, సాహితీవేత్త నాగభైరవ కోటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా శుక్రవారం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోటేశ్వరరావు రచనలలో సమాజ శ్రేయస్సు, అణగారిన వర్గాల పట్ల కరుణ, సానుభూతి కనిపిస్తాయని తెలిపారు. నాగభైరవ భువన విజయమునకు పేరడిగా కవన విజయం అనే సాహిత్య రూపాకాన్ని రూపొందించి 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. గుండ్లకమ్మ చెప్పిన కథ, తూర్పు వాకిళ్లు, ఒయాసిస్, కన్నీటిగాథ వంటి రచనలు ఎంతో ప్రఖ్యాతి గాంచాయని కొనియాడారు. తొలుత నాగభైరవ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో భాగ్యరత్న ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జి.వి. మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

రక్తదానాన్ని బాధ్యతగా భావించాలి

కడప కల్చరల్ : రక్తదానం చేయడం ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించాలని స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ స్పెషల్ ఆఫీసర్ జి.శివశంకర్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రక్తదాతల దినోత్సవం గురించి వివరించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, సంవత్సరానికి నాలుగుమార్లు రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితుల్లో రక్తదానం అవసరమో తెలియజేశారు. రక్తదానం చేయడం వల్ల ప్రయోజనాలు వివరిస్తూ సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. తలసేమియా, హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా రక్తం అందజేస్తున్నామని తెలిపారు. తమ బ్యాంకులో రక్తం ఉంటే పేదలకు తక్కువ సొమ్ముతో అందించగలమని తెలిపారు. అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రవిబాబు, ఏపీజీబీ జీఎం విజయభాస్కర్, నాబార్డు జిల్లా మేనేజర్ విజయ్ విహారి, డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కోఆర్డినేటర్ హిమాదేవి, యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ తులసి కూడా మాట్లాడారు.

సత్కారాలు – ఈ సందర్భంగా జిల్లాలో అధిక సార్లు రక్తదానం చేసిన వారిని రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పలుమార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సంస్థకు రక్తాన్ని అందజేసిన వారికి కూడా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం అవసరమైనపుడు, వీలున్నప్పుడు రక్తదానం చేస్తామని అందరూ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ యశస్విరెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్ సుధాకర్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ స్వరూపరాణి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కడప వైఎస్ఆర్ సర్కిల్: రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని కాంగ్రెస్ మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్మిక నాయకులు, కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అఫ్జల్ ఖాన్, సలావుద్దీన్, రమణారెడ్డి, కులాయప్ప, శ్యామలాదేవి, సుజాత రెడ్డి, కార్మిక నాయకులు అరుణ్ కుమార్, విక్కీ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

28వ సారి రక్తదానం చేసిన పట్టుపోగుల

వైవీయూ: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని బ్లడ్ టు లివ్ స్వచ్ఛందసేవా సంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ 28వసారి రక్తదానం చేశారు. శుక్రవారం కడప నగరంలోని రిమ్స్ బ్లడ్‌బ్యాంకులో ఆయన స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న యువతీ, యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని కోరారు. గత 17 సంవత్సరాలుగా రక్తదాన ఉద్యమంలో భాగస్వాములైన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.



కడప కోటిరెడ్డి సర్కిల్: రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న అతిథులు



కడప కోటిరెడ్డి సర్కిల్: రక్తదాతను అభినందిస్తున్న ఫాతిమా మెడికల్ కళాశాల అధికారులు, సిబ్బంది



వైవీయూ: రక్తదానం చేస్తున్న పట్టుపోగుల పవన్‌కుమార్

రక్తదానం మిన్న

కడప ఎడ్యుకేషన్: అన్ని దానాలకన్నా రక్తదానం ఎంతో మిన్న అని కడప టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్‌బాష అన్నారు. శుక్రవారం కడప మట్టిపెద్దపులి వద్ద జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని 32 సార్లు రక్తదానం చేసిన అరవింద్, 21 సార్లు రక్తదానం చేసిన మహేష్, 52 సార్లు రక్తదానం చేసిన ఆరిఫ్, 48 సార్లు రక్తదానం చేసిన తారిఖ్‌లను కడప టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అక్బర్, షఫీ, రహీం, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయడంలో యువతదే ప్రధాన పాత్ర

కడప కల్చరల్ : రక్తదానం చేయడంలో యువతకు ప్రధాన పాత్ర ఉందని కడప శాసనసభ్యులు మాధవీరెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా స్థానిక ఖాన్ కా రిస్తా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్తదాన ప్రాధాన్యత, ప్రయోజనాలను వివరించారు. రక్తదానం చేయడం మానవత్వానికి ప్రతీక అన్నారు. అవకాశం ఉన్న యువత తప్పక రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రక్తదానంతో ఇతరుల ప్రాణాన్ని నిలుపవచ్చని, ఈ అంశంలో యువత ప్రధాన బాధ్యత తీసుకోవాలన్నారు. స్థానిక ప్రముఖులు పి.మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఒక యువకుడు రక్తదానం చేస్తే రక్త కొరత ఉండదన్నారు. ఇంతియాజ్ అహ్మద్, ఖాన్ కా రిస్తా ఛారిటబుల్‌ట్రస్టు చైర్మన్ తారిఖ్ అలీల ఆధ్వర్యంలో 22 మంది యువకులు రక్తదానం చేశారు. నిర్వాహకులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి ఈ రక్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఇన్‌ఛార్జి శ్రీను, ఖాన్ కా రిస్తా సభ్యులు, పలువురు రక్తదాతలు పాల్గొన్నారు.

రక్తదానంతో పునర్జన్మ

కడప కోటిరెడ్డిసర్కిల్ : రక్తదానం ద్వారా మనిషికి పునర్జన్మ ప్రసాదించినట్లేనని స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి, సమారిటన్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ నగర్ యూత్ హాస్టల్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయిగ్రేస్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి నడుంబిగించాలన్నారు. జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య అధికారి రవిబాబు, ఎయిడ్స్ ప్రాజెక్ట్ ఇన్చార్జ్ భాస్కర్, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ రాజేంద్ర, సంస్థ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సురేంద్ర, వరప్రసాద్, శ్రీకాంత్, రక్తదాతలు పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా నిలవాలి

నేటి యువత రక్త దానం చేసి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని ఫాతిమా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సైలారేఖ పిలుపునిచ్చారు. శుక్రవారం ఫాతిమా వైద్య కళాశాల ఆవరణలో రక్తనిధి విభాగంలో పలువురు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామ మనోహర రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేసు, ఆచార్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కడప ఎడ్యుకేషన్: రక్తదాతలను సన్మానిస్తున్న మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



కడప వైఎస్ఆర్ సర్కిల్: రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



కడప కల్చరల్: మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కో ఆర్డినేటర్ హిమాదేవి

పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు

కడప అర్బన్: రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు సదరు ఫైల్‌పై సంతకం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కడపలోని జిల్లా కోర్టు ముందు టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. మొదట సీఎం చంద్రబాబు చిత్రపటంపై పాలాభిషేకం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.

గో రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేస్తాం



మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

కడప కల్చరల్ : గో రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేస్తామని కడప రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్ అన్నారు. గోవధ నిషేధ చట్టం అమలుపై శుక్రవారం ఆయన తన కార్యాలయంలో పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా గోవధ, వాటి మాంసం రవాణా నిషేధమన్నారు. దీన్ని అతిక్రమిస్తే తీసుకునే చర్యలు, చట్టాలు, పడే శిక్షలు గురించి వివరించారు. దీన్ని ఎవరు అధిగమించినా శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోకూడదని, ఎక్కడైనా జంతువులను నిర్బంధించి ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారు వాటిని గోశాలలకు తరలిస్తారని తెలిపారు. దిశ డీఎస్పీ రమాకాంత్ మాట్లాడుతూ నగరానికి నాలుగు వైపుల చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, పోలీసు పెట్రోలింగ్ ఉంటుందని వివరించారు. సింగిల్ విండో పద్ధతిలో అన్ని సంస్థల అధికారులను ఒక గ్రూపుగా చేసి సమస్యలు తలెత్తిన ప్రాంతానికి పోలీసులు, పశుసంవర్ధకశాఖ, మున్సిపల్ అధికారులు వెళ్లి రక్షిస్తారన్నారు. ఈ అంశాలపై ఎలాంటి ఇబ్బంది ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని ఆర్డీఓ సూచించారు. ఈ సమావేశంలో హిందూ ధార్మిక సంస్థల పెద్దలు, బీజేపీ నాయకులు, ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని లింగాపురం గ్రామంలో వెలసిన శ్రీ షిర్డీసాయిబాబ ఆలయంలో శుక్రవారం ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలను శ్రీ షిర్డీ సాయిబాబా సేవాశ్రమం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో మొదలుకుని విశేష అభిషేకాలు, అర్చనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో కొలువైన భద్రకాళి అమ్మవారికి భక్తులు రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజలలో స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కడపను సుందర నగరంగా తీర్చిదిద్దుతాం

– ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప రూరల్ : కడప నగరాన్ని అన్ని హంగులతో సుందర నగరంగా తీర్చిదిద్దుతామని కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవీరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కడప నగరాభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. నగరాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా బుగ్గవంకపై బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. కడప నగర ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, నాయకులు గోవర్దన్‌రెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కడప ఎడ్యుకేషన్: పెన్షనర్ల సంఘ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పేర్కొన్నారు. మాధవీరెడ్డిని శుక్రవారం కడపలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, గౌరవ అధ్యక్షులు నాగమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు పెన్షనర్ల సమస్యలను వివరించారు. ఆమె స్పందిస్తూ.. మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, పెన్షనర్ల సంఘ నాయకులు అపూర్వసుందరి, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కొండారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పాలెం చంద్ర శేఖర్, మల్లయ్య, సుబాన్, దేవరాజులతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి

కడప ఎమ్మెల్యేను కలిసిన జిల్లా పోలీసు అధికారుల సంఘం

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసుల రెడ్డిని, నూతనంగా కడప ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆర్. మాధవీరెడ్డిని శుక్రవారం పోలీసు అధికారుల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ జిల్లా పోలీస్ సిబ్బందికి ప్రభుత్వం తరపున రావాల్సిన బకాయిలు ఏవైనా వుంటే తమ దృష్టికి తీసుకుని వస్తే త్వరగా రావడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మాధవీలత, అసోసియేషన్ సభ్యులు రాచరాయుడు, శేఖర్, కృష్ణ, అంజి, పుల్లయ్య, బ్రహ్మయ్య, నాగార్జున, లక్ష్మిదేవి, పెంచల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

– సీఐ నాగరాజు

సిద్దవటం : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో శుక్రవారం సీఐ నాగరాజు మాట్లాడుతూ మండలంలోని డేగనవాండ్లపల్లె, టక్కోలి పెన్నానది పరివాహక ప్రాంతాల్లో చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు చెందిన ట్రాక్టర్‌ల యజమానులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. ఇసుక ట్రాక్టర్ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. పెన్నానదిలోకి వాహనాలు వెళ్లకుండా రహదారిని జేసీబీ యంత్రంతో తొలగిస్తామన్నారు. పెన్నానదికి చుట్టుపక్కల ఉన్న రైతులు, ప్రజలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిబ్బందికి సహకరించాలని ఆయన అన్నారు.

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయుడు

ఖాజీపేట : తవ్వారిపల్లె గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయ 7వ వార్షికోత్సవ ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్థానికులు పెద్ద ఎత్తున వచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం సేద్యపు ఎద్దులతో బండలాగుడు పోటీలను ఆయల కమిటీ సభ్యులు నిర్వహించారు. గెలిచిన వారికి కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు. ఉత్సవాల కోసం వచ్చిన భక్తులకు కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. దీంతో ఉత్సవాలు అత్యంత వైభవంగా పూర్తయ్యాయి.



బండలాగుడు పోటీలు జరుగుతున్న దృశ్యం

వైభవంగా బ్రహ్మోత్సవాలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండా వధూత ఆశ్రమం, గోవిందయ్య మఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చతుస్థానార్చన మూలమూర్తి హోమం, ఉత్సవబలి నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన గరుడ వాహనసేవలో శ్రీనివాసుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డి, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శివయ్య, రమేష్‌శర్మ పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఎర్రగుంట్ల : మాట్లాడుతున్న సీఐ ఈశ్వరయ్య

ఎర్రగుంట్ల : బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ ఈశ్వరయ్య సూచించారు. శుక్రవారం యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు జరుగకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవితో పాటు మత పెద్దలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని, పండుగ సమయాల్లో ఎలాంటి రాజకీయ కక్షలకు పూనుకోవద్దని మత పెద్దలకు సూచించారు. ముస్లిం మతపెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పెండ్లిమర్రి: సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ హరిప్రసాద్

పెండ్లిమర్రి: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ఐ హరిప్రసాద్ అన్నారు. పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం బక్రీద్ పండుగ సందర్భంగా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నింబధనలకు అనుగుణంగా పండుగను ప్రశాతంగా జరుపుకోవాలన్నారు. చట్టాన్ని అత్రికమిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెద్దముడియం: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి గొడవలు లేకుండా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.